

# రాధామోహనం

## – దేవరకొండ అన్నపూర్ణ



*ఇది ఒక అందమైన రాధామోహనగాథ. మనందరిలోను అంతర్లీనంగా ఉండి కాలప్రవాహంలో పడి మరిచిపోతున్న ప్రేమాభిమానాలనీ అనుభూతులని గుర్తు చేస్తూ, మనల్ని నవ్విస్తూ, అప్పుడప్పుడూ కళ్ళని చెమరుస్తూ, పనిలోపనిగా మరిచిపోతున్న విలువల్నీ మనుషులుగా మన బాధ్యతలనీ తట్టిలేపే కథామాలిక..!!*

7

## నిన్ను నిన్నుగా ప్రేమించుటకు.. తోడొకరుండిన..

సన్నగా నులివెచ్చని సూర్యకిరణాలు మీద పడుతుంటే వెచ్చటి గ్రీన్ టీ పట్టుకుని పెరటి లోకి వచ్చింది రాధ.

**నగుమోము గనలేని నా జాలి తెలిసి..**
**నను బ్రోవగ రాదా శ్రీ రఘువర...**

అని నెమ్మదిగా హమ్ చేసుకుంటూ అప్పుడే విచ్చుకున్న పువ్వులని, వాటి అందమైన నవ్వుల్ని, తెలిమంచు కరిగి చిరు చెమట పట్టిన కొమ్మల్ని, ఆకుల్ని ఆ ప్రేమలో తడిసి ముద్దవుతున్న మట్టి వాసనని.. ఆస్వాదిస్తూ కుచ్చిళ్లని సుతిమెత్తగా ఎత్తిపట్టుకుని.. గడ్డి లో నడుస్తోంది. సూర్యోదయాలన్న వెన్నెలరాత్రులన్న వెంటనే గుర్తొచ్చే రాగం ఆభేరి. త్యాగరాజ కీర్తనల్లో ఆభేరికి పెద్దపీట వేసి..

“ **జగమేలే పరమాత్మ ఎవరితో మొఱలిడుదు.. వగ చూపకు తాళను నన్నేలుకోరా.. త్యాగరాజనుత..** “ అని

అప్పటిదాకా తన రాముడిని సూటి పోటి మాటలు అన్న త్యాగరాజు చివర్లో “ఇంకెవరితో చెప్పుకోమంటావయ్యా “ అని బేలగా అడుగుతూ, ఆ భావం వ్యక్తీకరించడానికి ఆభేరి నెంచుకుని రాముడికి స్వరాభిషేకం చేశాడు త్యాగరాజు.

‘మోహన్ కి ఇష్టమైన రాగం . ఎప్పుడూ కొంటెగా నవ్వే ఆ కళ్ళల్లో పలకని రాగాలేమున్నాయిలే ‘ అనుకుంటూ ‘నిన్న కెనడాలో దిగిన తర్వాత మెసేజ్ పెట్టడం, ఇంటికి చేరాక పిల్లలతో మాట్లాడించడం తప్ప మోహన్ నిన్నంతా మాట్లాడలేదు’ మనసులో అనుకుంది రాధ.

ముందు రోజు మాంటిగామరీ వచ్చినప్పటి నుంచీ ఇక్కడ అహ్లాదకరమైన వాతావరణం, ఇంటి వెనుక పారుతున్న సెలయేరు ఎంతో నచ్చాయి, ఎంతగా అంటే ఇక్కడే ఉండిపోవాలన్నంత. అందుకేనేమో, లేట్ అయ్యింది, రాత్రికి ఉండిపొమ్మని మంజు అడగగానే ఉండిపోయింది రాధ.

మోహన్ కి ఈ ఇల్లు, వాతావరణం ఇదంతా చూపించాలని వీడియో కాల్ చేసింది. ఏం హడావిడి లో ఉన్నాడో పికప్ చెయ్యలేదు. రాత్రి ఎప్పుడో చూసుకున్నట్లున్నాడు, 'హాడ్ ఎ లాంగ్ డే, విల్ టాక్ టుమారో, గుడ్ నైట్' అని మాత్రం మెసేజ్ పెట్టాడు.
అలా అనుకుంటూ ఉండగానే, సెల్ ఫోన్ మోగింది. అయ్య గారికి శుభోదయం అయినట్టుంది అనుకుంటూ ఫోన్ పిక్ అప్ చేసింది రాధ. "ఏం స్వామి. తెల్లవారిందా, పిల్లలు లేచారా, ఏంటి ఇవాళ ప్లాన్" అని ఆగింది మోహన్ గొంతు వినాలి అన్న ఆశతో.
"ఇప్పుడే లేచాను ఇక్కడ లోకల్ గా మా క్లాస్మేట్స్ అందరినీ ఇవ్వాళ కలుద్దామని మధ్యాహ్నం ప్లాన్ చేసుకున్నాం, రెడీ అయి వెళ్తాను, అక్క ఒక నాలుగు రోజులు ఉండి వెళ్లరా, అంటోంది, టికెట్ వచ్చే శుక్రవారానికో శనివారానికో పుష్ చేద్దాం అనుకుంటున్నా, నువ్వు వచ్చేస్తావా పోనీ వీకెండ్ కి" అన్నాడు మోహన్.
మోహన్ ఎం.డీ చేసింది ఎడ్మన్టన్, కెనడాలోనే. తను చదువుకుంటున్న టైంలో తన ఇంటి ఓనర్ ఇండియన్ ఫేమిలీ కావడం, వాళ్ళ అబ్బాయికి సంబంధాలు చూస్తున్న క్రమంలో మోహన్ వాళ్ళ అక్క ప్రొఫైల్ చూపించి, ఇద్దరికీ నచ్చడంతో వాళ్ళ పెళ్ళి జరిగింది. తర్వాత కాలంలో రాధ కూడా ఎం.డీ కి అక్కడికే రావడం, వాళ్ళ పెళ్ళి జరిగాక వాళ్ళు అమెరికా షిఫ్ట్ అవ్వడం జరిగినా కెనడా అంటే రెండో పుట్టిల్లు మోహన్ కీ, రాధ కీ కూడా.
వాళ్ళ క్లాస్మేట్స్ చాలామందే అక్కడ ఉండటంతో రెండు రోజులు ఉండి కలిసి వస్తానని బయలుదేరాడు మోహన్. ఇప్పుడు వన్ వీక్ అనడంతో కొంచెం బెంగ అనిపించింది రాధకి. ఈలోపే వర్తమానం లోకి వచ్చి –
"లేదు ఈ వారం వచ్చే వారం కూడా కొన్ని ఎమర్జన్సీ అప్పాయింట్మెంట్స్ ఉన్నాయి. ఐ ఆల్రెడీ మిస్ యూ.. నన్ను వదిలేసి వెళ్ళిపోయారు, కానివ్వండి మీ కిష్కింధ కాండ. నిన్న మాట్లాడదాం అని కాల్ చేసాను, బిజీగా ఉన్నారేమో కదా. రాత్రి ఇక్కడే ఉండిపోయాను మోహన్ , మంజు ఉండిపోమంటే కాదనలేక పోయాను. మీరు వచ్చాక అన్నీ తీరిగ్గా చెబుతా కానీ మీరు ముందు ఈ ఇల్లు చూడాలి అని" కేమెరా ని టాగుల్ చేసి ఇల్లు పరిసరాలు అన్నీ చూపించింది రాధ.
"మనం రిటైర్మెంట్ హోమ్ ఇలా ప్లేన్ చేస్కోవాలి" అంటూ
"సరే రాధా. నేను మళ్ళీ సాయంత్రం మాట్లాడతాను, ఇంటికి ఎప్పుడు వెళ్తున్నావ్" మోహన్ గొంతులో కొంత తొందర ప్రతిధ్వనించింది. రాధ ఇక రెట్టించకుండా " సాయంత్రం బయల్దేరతాను" అని బై చెప్పి పెట్టేసింది.

ఆ రోజంతా మంజు తో కబుర్లలో సమయం తెలియకుండా గడిచిపోయింది రాధకి. సాయంత్రం మంజు ప్రేమతో చేసిన స్వీట్ తీసుకుని దారిలో ఎదురొచ్చిన బాబ్ కి కూడా హలో చెప్పి ఇంటికి వచ్చింది రాధ. రోజూ నాలుగు సార్లు ఫోన్ చేసే మోహన్ పగలంతా ఫోన్ చేయకపోవడంతో ఏదో వెలితిగా అనిపించింది. కాని "డిస్టర్బ్ చేయకూడదు ఫ్రెండ్స్ తో ఉన్నాడు , వీకెండ్ కదా బయటికి వెళ్లి ఉంటారు ఫ్రెండ్స్ అందరూ కలిసి" అని తనకి తానే సర్ది చెప్పుకుంది

రాత్రి ఎనిమిది దాటింది మోహన్‌కి ఇంకోసారి ఫోన్ చేసింది మళ్ళీ ఎత్తలేదు. సరే ఇంకా తిరిగి రాలేదు అనుకుని మెసేజ్ పెట్టింది "మిస్సింగ్ యూ, కాల్ మీ వన్స్" అని. పిల్లలు ఆడపడుచు నంబర్ నుంచి ఫోన్ చేసి మాట్లాడారు.

"నాన్న ఇంకా రాలేదమ్మా ఫ్రెండ్స్తో బయటికి వెళ్లారు" – అని చెప్పింది శ్రీనిధి.

రాత్రి చాలా లేటుగా మోహన్ నుంచి మెసేజ్.

" నెక్స్ట్ వీకెండ్ వస్తున్నాను. ఇప్పుడే ఇంటికి వచ్చాను టికెట్ మార్చాను. రేపు మాట్లాడుతాను, మిస్ యు టూ" అని

తర్వాత నాలుగు రోజులు యుగాల్లా గడిచాయి రాధకి. మోహన్ పొద్దున సాయంత్రం మెసేజ్లు తప్ప ఎక్కువగా మాట్లాడకపోవడం కొంత ఆశ్చర్యంగా అనిపించినా, పిల్లలతో మాట్లాడుతూనే ఉంది కనుక తను ఫ్రెండ్స్ తో తిరుగుతున్నాడు అని అర్థమై తనకు తానే సర్ది చెప్పుకుంది రాధ.

మోహన్ పంపిన ఫొటోలు చూస్తూ – అందులో దాదాపు తెలిసిన వాళ్ళే. ఒకరిద్దరు కొత్త వాళ్ళు. ఒక అమ్మాయి రిపీటెడ్ గా మోహన్ పక్కనే క్లోజ్ గా నిలబడి ఉండటం చూసి "యామ్ ఐ పొసెసివ్" అని కూడా ప్రశ్నించుకుని నవ్వుకుంది కూడా ఒకటి రెండు సార్లు.

మోహన్ శనివారం సాయంత్రం ఫ్లైట్ కి వస్తున్నాడు. పిల్లలు మాత్రం రెండు నెలలు అక్కడే ఉంటారు. రోజులు గంటలూ లెక్క పెట్టుకుంటోంది రాధ మోహన్ కోసం ఎదురుచూస్తూ

----------------------------------------------------------------------------------------------------------------
---

గురువారం సాయంత్రం.

ఇంటికి వచ్చి స్నానం చేసి సాలడ్ తినేసి, గ్రీన్ టీ పట్టుకుని ఫోన్ తీస్కుని వెళ్ళి పెరట్లో కూర్చుంది పాటలు విందామని. ఫోన్ మోగితే ఎవరా అని చూసింది.

కృష్ణక్క. చాలా కాలానికి ఫోన్ చేసింది. తను ఆస్ట్రేలియాలో ఉంది. వాళ్ళకి ఇది ఎర్లీ మార్నింగ్. సడెన్ గా వర్కింగ్ డే పొద్దున్నే ఫోన్ చేసింది అంటే ఏదో ముఖ్యమైన విషయం ఉండే ఉంటుంది అనుకుంటూ ఫోన్ ఎత్తింది రాధ.

"ఎలా ఉన్నావ్ రాధ. మోహన్ కి కాల్ చేసా ఎత్తలేదు. రుక్కూ కలిసిందా, మోహన్ ప్రొఫైల్ లో ఇప్పుడే చూసా ఫొటో.. యూ ఏస్ లో ఉందా" అని ప్రశ్నల్లో ముంచెత్తింది.

రాధ మనసులో సన్నగా కలుక్కుమంది. రుక్మిణి. తనేనా. మోహన్ చెప్పలేదే నాలుగు రోజులనుంచి. వచ్చాక చెబుదామనా. అందుకేనా నాలుగు రోజుల నుంచి మాటలు తగ్గాయి. వరద గోదారిలా ఆలోచనలు..

అంతలోనే సంభాళించుకుని – " ఎలా ఉన్నారు కృష్ణక్కా, మోహన్ వాళ్ళక్క దగ్గరికి కెనడా వెళ్ళాడు., రుక్మిణి అక్కడ కలిసింది. నేను కాలేజ్ లో జాయిన్ అయ్యేసరికే తను వెళ్ళిపోవడంతో నాకు రుక్మిణి పరిచయం లేదు కదా. మోహన్ కలిసాడు, నేనూ ఫొటోల్లోనే చూసాను." అని సర్ది "మీరు ఎలా ఉన్నారు." అంది టాపిక్ మారుస్తూ.

"రుక్కూ ఏం మారలేదు. అలాగే ఉంది. వచ్చాక మోహన్ ని కాల్ చెయ్యమను. ఎక్కడ ఉందో ఎలా ఉందో అడగాలి. నేను బానే ఉన్నాను. బిజీ యాజ్ యూజువల్" అని కాస్సేపు మాట్లాడి ఫోన్ పెట్టేసింది కృష్ణక్క.

**రుక్మిణి** – పేరు వినగానే తెలియకుండానే రాధలో అలజడి. దానిని అసూయ అంటారా అనుకుని నేను అసూయ పడాల్సిన అవసరం ఏముంది అనుకుని సర్ది చెప్పుకుంది

రుక్మిణి మోహన్ కి స్కూల్ ఫ్రెండ్ కమ్ ఫస్ట్ లవ్. తర్వాత ఇంటర్మీడియట్ కూడా కలిసి చదువుకుని పోటాపోటీగా మార్కులు తెచ్చుకుని రామయ్య కాలేజ్ లో ఇద్దరూ ఎం.బీ బీ.ఎస్ చేరారు. ఫస్ట్ ఇయర్ లో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగేవారట కూడా. తరువాత వాళ్ళ ఇంట్లో వాళ్ళకి తెలిసి తనని ఫస్ట్ ఇయర్ అవ్వగానే కాలేజ్ మానిపించేసి వాళ్ళ మధ్య కాంటాక్ట్ లేకుండా చెయ్యటం, మోహన్ చాలా మూడీ గా అయిపోవడం జరిగాయి. రెండేళ్ళ తరువాత రాధ జూనియర్ గా చేరిన రోజుల్లో మోహన్ కొంత నార్మల్ గా మారటం, రాధ ని రాగింగ్ లో ప్రొటెక్ట్ చెయ్యడం, మోహన్ రెసిడెన్సీ చేస్తున్న సమయంలో ప్రపోజ్ చెయ్యడం ఇవన్నీ జరిగాయి. కానీ రాధకి రాగింగ్ టైం లోనే కృష్ణక్క మోహన్ గురించి చెప్తూ – చాలా సైలెంట్ అనీ, కానీ ఫస్ట్ ఇయర్ లో చలాకీ గా ఉండేవాడనీ చెప్పింది.

మోహన్ ఈ వివరాలు అన్నీ ప్రపోజ్ చేసిన కొత్తల్లో చెప్పినా, తర్వాత కాలం లో మోహన్ రుక్మిణి గురించి ఎక్కువ వివరాలు చెప్పడానికి ఎప్పుడూ ఇష్టపడలేదు. తను ఎక్కడ ఉందో మోహన్ కి తెలియదు కూడా.

మళ్ళీ ఇన్నేళ్ళకి ఆ అమ్మాయి పేరు వింది రాధ.

వెంటనే మంజు – జాన్ గుర్తు వచ్చారు. తల అడ్డంగా ఊపి ఇంట్లోకి వచ్చి – మోహన్ కి కాల్ చేసింది – ఎత్తడు అని తన సిక్స్త్ సెన్స్ చెప్తూనే ఉన్నా. ఎత్తలేదు. మెసేజ్ పెట్టింది.

“స్లీపింగ్ ఎర్లీ, టయార్డ్, రేపు మాట్లాడదాం” అని

శుక్రవారం కూడా బిజీగానే ఉన్నా, అసంకల్పితంగా ఫోన్ వైపు చూస్తూనే ఉంది రాధ. మోహన్ ఫొటోలు పెట్టడంతో ఆడపడుచు ఫేమిలీతో డిన్నర్ కి వెళ్ళినవీ, తర్వాత ఇంట్లో గెట్ టుగెదర్ అన్నీ చూస్తూ, అన్నింట్లోనూ రుక్మిణి ఉండటం కూడా గమనించింది రాధ.

శనివారం మధ్యాహ్నం. మోహన్ ఏర్పోర్ట్ బయలు దేరే సమయం

పిల్లలు ఫోన్ చేసినప్పుడు, మోహన్ కూడా మాట్లాడుతూ, “చెకిన్ చేసి కాల్ చేస్తా – సీ యూ సూన్” అని పెట్టేసాడు.

సాధారణంగా ఆడపడుచు కానీ, తన భర్త ఆనంద్ కానీ డ్రాప్ చేస్తారు, సో హడావిడిలో ఉంటారు అనుకుని ఓ గంట తర్వాత పిల్లలకి కాల్ చేసింది రాధ. ఆడపడుచు మాధవి ఫోన్ ఎత్తింది.

“రుక్కు డ్రాప్ చేస్తాను అంటే మేము వెళ్ళలేదు. చిన్నప్పటి నుంచి తెలిసిన పిల్ల, ఇక్కడే ఉందని వీడు చెప్పేదాకా తెలియలేదు. ఇక్కడ దిగీ దిగగానే ఏర్పోర్ట్ లో కలిసారు. భలే థ్రిల్లయ్యాడు వాడయితే. వారం రోజులు ఎలా గడిచిపోయిందో తెలియలేదు. ఎప్పుడూ ఇలా వచ్చి అలా తుర్రుమనేవాడు, రుక్కు పుణ్యమేమో వారం రోజులున్నాడు. నువ్వు కూడా వచ్చి ఉంటే బావుండేది రాధ. నిన్న గెట్ టుగెదర్ లో అందరూ నిన్ను అడిగారు.”

భృకుటి ముడిపడింది రాధకి. మాధవి మాటల్లో ధ్వనించింది వ్యంగ్యమా, విరుపా అర్థం కాలేదు. మోహన్ ది, రాధది కులాంతర వివాహం. మోహన్ కి , తన అక్క మాధవికి ఒకరంటే ఒకరికి పంచ ప్రాణాలు కావడంతో రాధ అంటే సహజంగానే కొంత అయిష్టం ఉండేది మాధవికి చాలా ఏళ్ళ వరకూ.

తన మాటల్లో విరుపు కన్నా, తను చెప్పిన విషయం రాధని ఎక్కువగా అలజడికి గురి చేసింది.

పిల్లలతో మాట్లాడాను అనిపించి, లేచి ఇంకోసారి స్నానం చేసి, రెడీ అయ్యింది రాధ. మోహన్ చెకిన్ చేసి మెసేజ్ పెట్టాడు. "సీ యూ ఇన్ త్రీ అవర్స్.. లవ్ యూ "అని. కాల్ చెయ్యలేదు, రాధ కూడా కాల్ చెయ్యలేదు.

మోహన్ ఇంకో గంట లో లాండ్ అవుతాడు. కీస్ తీసుకుని బయలు దేరేముందు ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంది. టేబిల్ మీద తను రాసుకున్న డైరీ ఉంది.తీసి లోపల పెట్టేసి బయలుదేరింది.

కార్ ఫ్రీవే ఎక్కగానే మెరూన్ 5 పాట స్టీరియోలో

And the memories bring back, memories bring back you
There's a time that I remember, when I did not know no pain
When I believed in forever, and everything would stay the same
Now my heart feel like December when somebody say your name
'Cause I can't reach out to call you, but I know I will one day, yeah.

రేడియో ఆపేసింది రాధ. తల అడ్డంగా ఊపి, "నో రాధా, యు ఆర్ ఓవర్ రియాక్టింగ్. షీ యాస్ బీన్ హిస్ ఫ్రెండ్ ఫ్రొం స్కూల్ డేస్" అని పైకే అనేసింది.

కానీ ఆలోచనలు ఊపందుకున్నాయి. రుక్మిణి ఒక్కతే ఉందా. తన ఫేమిలీ? వెంటనే విశ్వ, శాంతి గుర్తు వచ్చేరు రాధకి కార్ 80 ఎం.పీ.ఎచ్ దాటుతూంటే

---

మే లో న్యూయార్క్ కి వారం రోజుల కాన్ఫరెన్స్ కి వెళ్ళాడు మోహన్. అక్కడ నుంచి ఫోన్ చేసి –

"కాన్ఫరెన్స్ కి మన జూనియర్స్ విశ్వనాధ్, శాంతి వచ్చారు... అప్పట్లో వాళ్ళు ప్రేమించుకుని పెద్దవాళ్ళ వత్తిడి వల్లో కులాల అంతరాల వల్లో విడిపోయారని తెలుసు... ఆ తర్వాత మెడికల్ కాన్ఫరెన్స్లలో విడివిడిగా కనపడటమే తప్ప వాళ్ళని కలిసి చూసిందే లేదు.. చాలా సంతోషంగా అనిపించింది రాధా. వాళ్ళని చూసి. ఇంటికి ఇన్వైట్ చేసాను. నాతో వస్తున్నారు " అన్నాడు మోహన్

"ఓహ్ వావ్, చెప్పండి ఎలా ఉన్నారు ఇద్దరూ.. ఎక్కడ సెటిల్ అయ్యారు.. ఫ్యామిలీఎలా ఉన్నారట"

అనడిగిన రాధ తో
"వస్తున్నాంగా నువ్వే చూడు" అన్నాడు మోహన్.

రాగానే సాదరంగా ఆహ్వానించింది రాధ. శాంతి "సో గుడ్ టు సీ యు, యూ ఆర్ సో లక్కీ" అంది రాధతో.

విశ్వ, శాంతి ఇద్దరికీ పెళ్లిళ్లు అవ్వడం వరకూ రాధకీ, మోహన్ కీ తెలుసు, ఇండియా నుంచి వచ్చేసాక వాళ్ళ బ్యాచ్ వరకూ టచ్ లో ఉన్నారు తప్ప వీళ్ళ గురించి అసలు వినలేదు. మాటల్లో తెలిసింది – విశ్వ కి ఒక బాబు, ఒక పాప. అతని భార్య గృహిణి. విశ్వ ఎండోక్రైనాలజిస్ట్ గా ధీరుబాయి అంబానీ హాస్పిటల్ పూణే లో పని చేస్తున్నాడు. శాంతికి ఒక సాఫ్ట్వేర్ ఇంజనీర్తో పెళ్లయ్యింది, పెళ్లి అయ్యిన రోజునించీ అనుమానంతో హింసించి చివరికి విడాకుల దాకా వెళ్ళింది. ఒక బాబు. వాడు అండర్ 16 క్రికెట్ టీంలో ఆడుతున్నాడట పూణేలోనే. శాంతి తల్లితండ్రుల దగ్గర ఉంటూ విశ్వ సపోర్ట్ తో పూణే ధీరుబాయి హాస్పిటల్ లోనే గైనకాలజిస్ట్గా పని చేస్తోంది. కాన్ఫరెన్స్ కి కలిసే వచ్చారు అని అర్థమైంది రాధకి.

మోహన్ లోపలికి వచ్చి – "వాళ్ళని చూసి లవ్ ఈజ్ ఎటర్నల్ అనిపించింది" అని ఆపాడు మోహన్. మోహన్ కళ్ళల్లో మెరుపుతో పాటు ఒకింత అసూయ కూడా.

"అవును మోహన్... అప్పట్లో కూడా విశ్వ – శాంతి కోసం పళ్ళు, పరీక్షలప్పుడు రాత్రి చదువుకోడానికి ఫ్లెస్క్ నిండా టీ తెచ్చి హాస్టల్ గేట్ దగ్గర నుంచుని వార్డెన్తో నానామాటలు అనిపించుకుని మరీ ఇచ్చి వెళ్ళేవాడు.. అంత పిచ్చి ప్రేమికుడు వాళ్ళు విడిపోతే ఏమైపోతాడో అనుకునేవాళ్లం మేమంతా.." అంది రాధ

"మేము అలాంటివి చేస్తే మరునాడు మూతి తిప్పుకుని వెళ్ళిపోయి ఇన్నేళ్లకి చెప్తావా విశ్వ హీరోయిక్స్..." అని భుజాలెగరేసి..

"జోక్స్ అపార్ట్.. నిజంగా విశ్వ తన ప్రేమ నిజమైంది అని నిరూపించాడు రాధా.. 20 సంవత్సరాల తర్వాత కూడా వాళ్ళని చూస్తే ఫాలింగ్ ఇన్ లవ్ అగైన్ అండ్ అగైన్ అనిపించేలా. శాంతి ఐతే డివోర్స్ అయ్యాక తను ఇంకో పునర్జన్మ ఎత్తాను మోహన్ అని చెప్పింది నాతో, మెరిసే కళ్ళతో విశ్వ వైపు చూసి. విశ్వకి పెళ్ళై పిల్లలున్నారు అని తెలుస్తూనే ఉంది.. ఇద్దరూ కలిసి ఇద్దరి పిల్లలకి విశ్వ వైఫ్ కి షాపింగ్ కూడా చేసారు. ఇద్దరూ కాలేజ్ రోజుల్లో ఉన్నట్లే ఉన్నారనిపించింది. చాలా హేపీగా అనిపించింది. ఇక్కడ శాంతి కజిన్ కూడా ఉందిట. వాళ్ళకి ఎలాగూ ఇటు వచ్చే ప్లాన్ ఉంది అంటే మన ఇంటికి రమ్మని ఇన్వైట్ చేసాను" అన్నాడు మోహన్

"మంచి పని చేసారు" అంది రాధ.

శాంతి ఆరోజు సాయంత్రం బయలు దేరి తన కజిన్ ఇంటికి వెళ్తాను అంటే, మోహన్ డ్రాప్ చెయ్యడానికి వెళ్ళాడు. విశ్వ ఒక్కడే ఉన్నప్పుడు రాధ అడిగింది.

"నీ భార్యకి తెలుసా విశ్వా!"

" రాధా, మొదటి నుంచీ మీది ముక్కుసూటి మనస్తత్వం అని నాకు తెలుసు. మీరు అడగకపోయినా నేనే చెబుదామనుకున్నా – నాకు మీ సలహా కావాలి కూడా.

అప్పట్లో నా కన్నా అగ్రకులానికి చెందిన అమ్మాయి ఐన శాంతిని వాళ్ళ కుటుంబాన్ని ఎదిరించి పెళ్లి చేసుకుందామని ప్రయత్నించి ఒక డాక్టర్ని అయ్యి కూడా ఒత్తిళ్లకు తలవొగ్గి నా మేనకోడలిని పెళ్లి చేసుకున్నాను. ఆ అమ్మాయికి ఎటువంటి లోటు రానివ్వను కూడా. భర్తగా, నా తండ్రిగా నా ధర్మం తప్పను కానీ శాంతి జీవితంలో అలజడి తెలిసాక ఆ అశాంతికి నేనే కారణం ఏమో అన్న ఆలోచన నన్ను దహించి వేసింది.

శాంతి నన్ను మరిచిపోలేక అతనికి మొదట్లోనే నా గురించి చెప్పడం, నేను అప్పట్లో టచ్ లో కూడా లేనప్పటికీ అతను శాంతిని ఇబ్బంది పెట్టడం ఇవన్నీ శాంతి డివోర్స్ అయ్యాక హాస్పిటల్ కి ఫోన్ చేసి చెప్పేదాకా నాకూ తెలియదు. తర్వాత శాంతిని కలిసినప్పుడు తన కళ్ళు చూసి నా మనసులో అణచిపెట్టుకున్న బాధని నా కళ్ళు బయటపెడుతుంటే శాంతి అంది.. ' దేవుడు పెద్ద మాయలమారి విశ్వ... అబద్దాలు ఆడటానికి పెదాలనిచ్చినా నిజాలు చెప్పెయ్యమని కళ్లనిచ్చాడు' అని .. ఆ మాట విని అప్పుడే శాంతికి చెప్పాను .. ' నీ పెదాలతో కళ్ళతో ఒకటే మాట చెప్పించే అవకాశం ఇస్తే చాలు శాంతి... ప్లీజ్' అని..

ఆ రోజునుంచి తన కళ్ళు చెమ్మగిల్లకుండా చూసుకుంటున్నాను శాంతిని. దీనికి లోకం ఏ పేరు పెట్టినా నాకు అభ్యంతరం లేదు. నేను ఎవరి కోసం బ్రతకట్లేదు బ్రతకదలుచుకోలేదు కూడా. నా భార్యా బిడ్డలకి అన్యాయం చెయ్యను, నా భార్యకి చెప్పాను 'ఆ అమ్మాయి నా స్నేహితురాలు నేను అండగా నిలుచుంటాను. తనకి నేను తప్ప ఎవరు లేరు. నీకే లోటు రాదు, నువ్వు దయచేసి అడ్డు రావద్దు. ఇది నా ఇండివిద్యువాలిటీ. దాన్ని మన్నిస్తే మనిద్దరికీ మంచిది' అని. మొదట్లో కొంత ఇబ్బంది పెట్టినప్పటికీ నెమ్మదిగా అర్థం చేసుకుంది నా భార్య కూడా"

అని ఆపాడు విశ్వ.

"నన్ను నీతీ, న్యాయం, ధర్మం తెలియని వాడని ఈ సమాజం వేలెత్తిచూపినా సరే, నేను శాంతికి ఏ లోటూ రాకుండా చూసుకుంటాను అని మాట ఇచ్చాను రాధా. మీ ప్రొఫెషన్ వల్ల మాత్రమే కాదు, పర్సనల్గా మీ గురించి తెలుసు కనుక మీతో షేర్ చేసుకుని, మీ సలహా తీసుకోవాలనిపించింది. నేను తప్పు చేస్తున్నానా?" అన్న విశ్వ గొంతులో బాధ, ప్రేమ రెండూ సమానంగా ధ్వనించాయి.

"ధర్మాన్ని తప్పనంత వరకు తప్పొప్పుల మాట లేదు విశ్వ. చాలామందికి నీతి, న్యాయం ధర్మం అని ఊతపదాలు గా వాడటం తప్ప వాటి అర్థం కూడా తెలియదు.

నీతి – moral values. ఇవి ఎవరికీ వారు వారి కాలమాన పరిస్థితులు సందర్భాలని బట్టీ గీసుకునే గీతలు. కామన్ స్టాన్స్ ఉండదు. భుజం మీద చెయ్యి వెయ్యడం ఒకరికి తప్పు కావచ్చు మరొకరికి కామన్ అనిపించచ్చు.. హగ్గులు, పెక్ లూ, షేక్ హ్యాండ్లూ.. దగ్గరి నుంచీ స్నేహాలూ ప్రేమలూ వరకు ఎవరికీ వారు నిర్ణయించుకోవచ్చు.. సమాజం నిర్ణయించేది అంటూ ఉండదు, కానీ ఉన్నట్టు అందరూ భ్రమలో బ్రతికేస్తుంటారు హిపోక్రాట్స్ లా. రాజనీతి వీరు, యుద్ధనీతి వేరు, అలాగే ఎవరికీ కావాల్సింది వారు నిర్ణయించుకుని పాటించచ్చు మార్చుకోవచ్చు కూడా...

న్యాయం – legal/ law of the land. చట్ట బద్ధమైన గీతలు... ఒక పరిధిలో ఉన్న అందరికీ సమానంగా వర్తించేలా నిర్ణయింపబడేవి.. 10 పెళ్లిళ్లు కొన్ని దేశాల్లో న్యాయపరమే చాలా దేశాల్లో కాదు కదా. తప్పు చేసిన వాడిని శిక్షించడం ప్రభుత్వానికి సంబధించిన విషయం.. సరయిన పనైనా కామన్ మాన్ చేస్తే న్యాయ పరమైన ఇబ్బందులు తప్పవు.

ఇక ధర్మం – righteousness. ఇక్కడే ఉంది చిక్కంతా. ఇది ఎక్కడైనా ఎప్పుడైనా ఒకటే. భార్యగా ధర్మం, భర్తగా ధర్మం, స్నేహధర్మం ( స్నేహనీతి అనరు గమనించు )..రాజ ధర్మం, మానవతా ధర్మం, ఇలా.. చివరికి శత్రు ధర్మం కూడా ఉంటుంది. దీన్ని పాటించక పోవడం ఖచ్చితంగా తప్పే. రాముడు తిరిగిన నేల మనది. మనకి కష్టాలు వచ్చిన కన్నీళ్లు వచ్చిన ధర్మాన్ని తప్పొద్దన్న తల్లి కౌసల్య మాట రాముడు కడదాకా పాటించి మహనీయుడయ్యాడు. నీతి న్యాయం పాటించకపోయిన ఇబ్బంది తప్ప ప్రాణాంతకమైన తప్పు అవదు కానీ ధర్మం తప్పడం మాత్రం ఎన్నటికీ తప్పే. ఒక మనిషిగా మన మాటకి మనం కట్టుబడి మన ధర్మాన్ని మనం పాటించకపోతే ముప్పు తప్పదు. నీకు శాంతి పట్ల కూడా ధర్మం ఉంది అని నువ్వు అనుకుంటే అది కూడా పాటించితీరవలసిందే. అది స్నేహధర్మం, మానవతా ధర్మం కూడా – భర్తగా నువ్వు ఫెయిల్ అవ్వనంత వరకూ, నీ ధర్మం తప్పనంత వరకూ.

పాలీగామీ అనేది న్యాయ విరుద్ధం తప్ప – ఇది మానవ సంబంధాలలో కొత్తదేం కాదు. మానవతా ధర్మాన్ని మరచి ఎదుటి వారిమీద బురద చల్లే వారు ఎప్పుడూ ఉంటారు. ఏదో ఒకరోజు రావణ కాష్టాన్నీ ఎదుర్కొంటారు కూడా. దాని గురించి వర్రీ అవ్వనక్కరలేదు. గో బై యువర్ ఇంస్టింక్ట్స్. ఫాలో యువర్ హార్ట్. " ఆపింది రాధ.
విశ్వ కళ్లల్లో నీళ్ళు.
"థాంక్యూ, ఇట్ మీన్స్ ఎ లాట్. ఇట్ రియల్లీ డజ్" అన్నాడు విశ్వ.

రెండు రోజులు ఉండి వెళ్ళారు ఇద్దరూ. తర్వాత మాటల్లో మోహన్ కి రాధ చెప్పినప్పుడు మోహన్ నవ్వి – "ఐతే పాలీగామీ ఈజ్ అప్రూవ్డ్ అన్నమాట" అన్నాడు.
"అహా! నన్ను చూస్కోవడానికే డాక్టర్ గారికి టైం సరిపోవట్లేదు. ఇంక వేరే వాళ్ళు కూడా"
అని తేలికగా నవ్వింది రాధ.

---

ఏర్పోర్ట్ ఎక్సిట్ తీసుకుని తల విదిలించి స్పాటిఫై ఆన్ చేసింది రాధ.

మళ్ళీ ఆభేరి –

**తెలుసా మనసా.. ఇది ఏనాటి అనుబంధమో, తెలుసా మనసా.. ఇది ఏ జన్మ సంబంధమో..**
ప్రేమకి రూపమైన 'విశ్వ' రూపం, ఆభేరిలో ఆర్ద్రత – **నగుమోము గనలేని నా జాలి తెలిసి** – బేలయిన 'శాంతి' రూపం
ప్రేమకి టైటిల్స్ తో పనిలేదంటూ, సమాజపు కట్టుబాట్ల పేరుతో కట్టుకునే అర్థరహితమైన గోడలను ఛేదించిన 'విశ్వ శాంతి' , కట్టుబాట్ల తో పని లేని జాన్ – మంజు తన కళ్ల ముందు మెదులుతుంటే దూరంగా ఏర్-బేగ్ తగిలించుకుని పికప్ లేన్ లో నిల్చొని చెయ్యి ఊపుతున్న మోహన్ ని చూసి కార్ స్లో చేసింది రాధ.
కళ్ళు మసకబారినట్లనిపించి *కళ్ళు తుడుచుకుని* – కార్ దిగింది. మోహన్ ఫోన్ రింగయ్యింది అప్పుడే..

*(వచ్చే నెల మరో మోహనం)*